పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలి


కాల్వశ్రీరాంపూర్: బడిబాట అవగాహన ర్యాలీ


ఎలిగేడులో..


పెద్దపల్లిరూరల్: పెద్దబొంకూర్‌లో బడిబాట

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించి ఉచితంగా నాణ్యమైన విద్యను పొందాలని మండల పరిషత్ అధికారి సుదర్శన్ అన్నారు. పెద్దపల్లి మండలం భోజన్నపేటలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దపల్లి పట్టణంలోని అమర్‌నగర్‌లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. సీఆర్‌పీ వెంకటేశంతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బడిబాట విజయవంతానికి కృషిచేయాలి

జూలపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు చేపడుతున్న బడిబాట విజయవంతానికి మహిళా సంఘాల సభ్యులు తమవంతు సహకారం అందివ్వాలని ప్రధానోపాధ్యాయులు గడ్డం అనంతరెడ్డి కోరారు. మండలంలోని కుమ్మరికుంటలో బడిబాట విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులు, మహిళా సంఘాల సభ్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరూ సహకరించాలి

సుల్తానాబాద్: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని హెచ్‌ఎం రత్నాకర్‌రెడ్డి కోరారు. గురువారం సుల్తానాబాద్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాల ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులతో బడిబాట ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు.

విద్యార్థుల నమోదు పెంచాలి

ధర్మారం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని తహసీల్దార్ రజిత ఆదేశించారు. ధర్మారం మండల విద్యాధికారి కార్యాలయంలో గురువారం మండలస్థాయిలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 6 నుంచి 19 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు విధిగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు అధికశాతం చేయించాలని ఆమె కోరారు. ప్రాభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి మండల విద్యాధికారి ఛాయాదేవి వివరించారు. ఏపీఎం తులసి, సీసీ విజయలక్ష్మి, వీవో చైర్మన్ లహరి మహిళా సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

ముత్తారం: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందిస్తున్నామని అడవిశ్రీరాంపూర్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓదెలు అన్నారు. గురువారం ముత్తారం మండలం అడవిశ్రీ రాంపూర్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ముత్తారంలో జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం పద్మావతి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

బడిబాటపై అవగాహన ర్యాలీ

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలిగేడు మండలంలో..

ఎలిగేడు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం బడిబాటపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని, బడిమానేసిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం దేవేందర్‌రావు, ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టుమార్టం త్వరగా పూర్తి చేయండి


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్: పోస్టుమార్టం వేగవంతంగా చేసి మృతదేహాన్ని ఇంటికి పంపించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రి డాక్టర్లకు సూచించారు. సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామపంచాయతీ పరిధిలోని మారుతి నగర్‌కు చెందిన ఆవుల కాపరి నూనె కనకయ్య, నాలుగు గేదెలు విద్యుత్ వైర్లు తాకడంతో బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే. పోస్టుమార్టం కోసం సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి మృతదేహం తీసుకురాగా గురువారం వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. పోలీసులు పంచానామా చేసిన వెంటనే డాక్టర్లు పోస్టుమార్టం వేగవంతంగా చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలన్నారు. మృతుని కుటుంబానికి అండగా నిలుస్తామని, ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ మినుపాల ప్రకాశ్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, మిస సత్యనారాయణ, అంజయ్య, శ్రీనివాస్, రాంరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కనుకుల(మారుతినగర్)కు చెందిన బర్ల కాపరి కనకయ్య, అతడి గేదెలు బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. కాగా గురువారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే విజయరమణారావు పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్‌రావు, సతీశ్, సత్యనారాయణ, అంజయ్య, శ్రీనివాస్, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.



ఆటవిడుపు.. అష్టాచెమ్మా

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారంలో ఓ ఇంట్లో వరండాలో చిన్నాపెద్దా కలిసి అష్టాచెమ్మా ఆడుతున్నారు. పచ్చీసు కాయలు గుప్పిట్లో ఊపుతూ నేలపై విసిరి చిత్తులు లెక్క పెడుతూ గదుల్లో ఉన్న కాయలు చంపుతూ ముందుకు వెళ్లడం, సంపుడు పంజం, సురక్షితంగా ఇంట్లో చేరడం.. పిల్లలు ఆనందంతో కేరింతలు కొడుతూ ఆడారు. ఈ ఆటలు పిల్లలకు గెలుపు, ఓటమిని స్ఫూర్తిగా తీసుకోవడం నేర్పిస్తాయి. అయితే వేసవి సెలవుల్లో అష్టాచెమ్మా ఆడుతున్న పిల్లలను గురువారం సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన


అభినందిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి గురువారం అభినందించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో చిన్నారులకు మెమెంటోలు అందించి సత్కరించారు. 28వ జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీల్లో సుమన్ సోతోకాన్ స్పోర్ట్స్ కరాటే డో అకడమిక్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు ఖమ్మం జిల్లా కేంద్రంలోని వర్తక సంఘం భవనంలో ఈనెల 2న జరిగాయి. పోటీల్లో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన హుయాన్ చుంగ్ కుంగ్‌ఫూ ఇంటర్నేషనల్ అకాడమీకి చెందిన నలుగురు విద్యార్థులు సత్తా చాటారు. కె.నిహారిక గోల్డ్‌మెడల్, ఎండీ గౌస్ గోల్డ్‌మెడల్, కార్తికేయ గోల్డ్‌మెడల్, వై.విష్ణువర్ధన్ సిల్వర్‌మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఎం.రాజేశం, డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ మొక్కలపై క్షేత్ర పరిశీలన


వివరాలు నమోదు చేస్తున్న ఎంపీడీవో అలీం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గ్రామాల వారీగా ఉన్న నర్సరీల్లోని మొక్కలపై ఎంపీడీవో ఎం.ఏ.అలీం క్షేత్ర పరిశీలన చేపట్టారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలో 45వేల మొక్కల పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నర్సరీల్లో మొక్కల లభ్యత, మొక్కల రకాలు తదితర అంశాలపై వివరాలు సేకరించారు. హరితహారంలో అధికంగా కూరగాయలు, పూలు, పండ్ల మొక్కల పెంపకంపైనే ప్రత్యేక దృష్టిసారించినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

శివాలయంలో చండీహోమం


ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని విశ్వకర్మ శివాలయంలో చండీహోమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి మహా చండీహోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్యాల రాజమౌళి చార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'మిషన్ భగీరథ' అమలుపై సమీక్ష

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గ్రామాల్లో మిషన్ భగీరథ అమలుపై క్షేత్ర స్థాయి సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం అంతర్గాం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో ఎం.ఏ.అలీం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, వీవోఏ, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటింటికీ పర్యటిస్తూ మిషన్ భగీరథ నీటి సరఫరాపై సర్వే చేపట్టాలని సూచించారు. కుందనపల్లి అనుబంధ గ్రామమైన అక్బర్‌నగర్‌లో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం వివాదాస్పదం కావడంతో ఏళ్లుగా మిషన్ భగీరథ నీటికి నోచుకోవడం లేదనే విషయాలను క్షేత్ర సిబ్బంది సభాదృష్టికి తీసుకువచ్చారు. ఈ వివరాలన్నీ నమోదు చేసుకోవాలని ఎంపీడీవో ఆదేశించారు. వీటన్నింటితో పాటు నీటి సరఫరాలో జరుగుతున్న అసౌకర్యాలను సైతం తెలుసుకోవాలన్నారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీవో రమేశ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీని ఆదరించిన ఓటర్లు

జూలపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు బీజేపీని ఆదరించారని పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ దేశ ప్రధానిగా మోదీ మూడోసారి పదవి చేపట్టాలనే ప్రజల దృఢ సంకల్పమే దేశంలో అతి పెద్ద పార్టీగా అవతరించిందన్నారు. నాయకులు సంతోష్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, మల్లేశం, పొన్నం వెంకటేశ్‌గౌడ్, వేణుగోపాల్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జి రాజు, మహేందర్, సింగిరెడ్డి మహిపాల్ ఉన్నారు.

కుళ్లిన పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు


తనిఖీ చేస్తున్న మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్

సుల్తానాబాద్: హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో ఫ్రిడ్జిలో పెట్టిన కుళ్లిన పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సుల్తానాబాద్ మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్ హెచ్చరించారు. పట్టణంలోని పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు, చికెన్ సెంటర్లను గురువారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలతోపాటు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అపరిశుభ్రంగా ఉంటే జరిమానా విధిస్తామని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ సిబ్బంది నాగరాజు, రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, కృష్ణ ఉన్నారు.

'ఖని'లో బీజేపీ నేతల సంబరాలు


టపాసులు పేల్చుతున్న నాయకులు

గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ పరిధిలోని రామగుండంలో భారీ మెజార్టీ సాధించడాన్ని హర్షిస్తూ గురువారం స్థానిక ప్రధాన చౌరస్తాలో సంబరాలు జరిపారు. కార్యక్రమంలో బీజేపీ నియోజవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, నాయకులు మెరుగు హన్మంతుగౌడ్, గాండ్ల ధర్మపురి, సుల్వ లక్ష్మీనర్సయ్య, కోమళ్ల మహేశ్, తోట కుమారస్వామి, సుమంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు గురువారం రీజినల్ లేబర్ కమిషనర్‌కు హైదరాబాద్‌లోని రీజినల్ లేబర్ ఆఫ్ సెంట్రల్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యాజమాన్యంతో జరిగిన ఒప్పందం చేసుకున్నప్పటికీ సమస్యలు చాలా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్మిక సంఘాలు, కార్మికుల జీతభత్యాలు, అలవెన్సులు, ప్రమోషన్ పాలసీ, ఐ.టీ.ఐ. ప్రమోషన్ పాలసీ, తెలంగాణ ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు ప్రాధాన్యం, తదితర విషయాలపై అగ్రిమెంటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. యాజమాన్య ఒప్పందం పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో యాజమాన్యంతో అనేకసార్లు చర్చించినప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. కార్మికుల సమస్యలు, విషయాలను పరిశీలించి యాజమాన్యంతో చర్చించాలని కోరామని తెలిపారు. జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

టీబీ నియంత్రణకు కృషి చేయాలి


శిక్షణ ఇస్తున్న మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా

ఎలిగేడు: టీబీ నియంత్రణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి నిస్సీక్రిస్టీనా కోరారు. ఎలిగేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అడల్ట్ టీబీ వ్యాక్సినేషన్‌పై ఆశా కార్యకర్తలకు, అంగన్‌వాడీ టీచర్లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ 18ఏళ్లు పైబడిన వారికి, వయోజనులకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తే టీబీని నివారించవచ్చని పేర్కొన్నారు. అడల్ట్ టీబీ వ్యాక్సినేషన్ మూడు నెలలపాటు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ సురేందర్, ఆరోగ్య విద్యా బోధకురాలు రాజేశ్వరిదేవి, హెల్త్ సూపర్‌వైజర్లు నాగమణి, లక్ష్మన్ పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం


మాట్లాడుతున్న నాయకులు

మంథని: విద్యుత్ రంగంలో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న కార్మిక సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటాలు చేస్తున్నామని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నలువాల స్వామి అన్నారు. గురువారం మంథనిలో ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ సమావేశం నిర్వహించారు. విద్యుత్ రంగంలోని కార్మికులు, జూనియర్ లైన్‌మెన్ల ప్రమోషన్, అన్‌మ్యాన్డ్, ఆర్టిజన్స్, మీటర్ రీడర్స్, బిల్ కలెక్టర్లు, ఎస్‌పీఎం వర్కర్లు, ఇతర కేటగిరీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తమ సేవలకు ఆకర్షితులై మంథని డివిజన్‌లో ఎస్‌పీఎం కార్మికులు యూనియన్‌లో జాయిన్ అయినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు వాగు నాయక్, మంథని సీఐటీయూ బాధ్యుడు బూడిద గణేశ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మట్ట రాజు, సత్యనారాయణ, కృష్ణమూర్తి ఉన్నారు.

భూసార పరీక్షలతోనే అధిక దిగుబడి


మట్టిని పరీక్షిస్తున్న మేనేజర్ రాహుల్

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్, నీరుకుల్ల గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కోరమండల్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం భూసార పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కోరమండల్ కంపెనీ డిప్యూటీ మేనేజర్ రాహుల్‌కుమార్ మాట్లాడుతూ నేల స్వభావం అనుగుణంగా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడి వస్తుందని వివరించారు. సంఘం సీఈవో సంతోష్, వెంకటేశ్వర్లు, సురేశ్‌రెడ్డి, లచ్చయ్య, సాగర్, రాంబాబు ఉన్నారు.

కుందనపల్లిని కప్పేసిన ఎన్టీపీసీ బూడిద

రామగుండం: ఎన్టీపీసీ ప్రభావిత కుందనపల్లి గ్రామంపై గురువారం వీచిన భారీ ఈదురుగాలులతో బూడిద చెరువు నుంచి భారీగా బూడిద లేచి గ్రామాన్ని కప్పేసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏటా మే, జూన్ మాసాల్లో ఈదురుగాలులతో ఎన్టీపీసీ బూడిద గ్రామాలను కప్పేస్తున్నా యాజమాన్యం ముందస్తు చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. కాగా బూడిదతో సమీపంలోని రైల్వే క్వార్టర్లు, రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థపై సైతం ప్రభావం చూపుతుందని పలువురు పేర్కొంటున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేత?

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీసుల అదుపులో గంజాయి విక్రేత ఉన్నట్లు సమాచారం. గురువారం స్టేషన్ పరిధిలో ఎన్టీపీసీ పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో 180 గ్రాముల గంజాయితో పాటు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం. పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో గంజాయి విక్రయించడంతో పాటు సేవించడం ఎక్కువగా ఉందనే సమాచారం మేరకు తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం.

మంథనిలో..

మంథని: గంజాయి సేవించే, విక్రయించే పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. మంథనితో పాటు చుట్టు ప్రాంతాలకు చెందిన యువకులు ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం. యువకులు, మైనర్లు గంజాయికి బానిస అయినట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకోగా కొంత మేర గంజాయి లభ్యమైనట్లు తెలుస్తోంది. మంథని ప్రాంతానికి గంజాయి ఎక్కడి నుంచి రవాణా జరుగుతోంది, దీని వెనుక ఎవరున్నారనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్


ముచ్చకుర్తి శ్రీనివాస్

రామగిరి: మున్నూరుకాపు మండల అధ్యక్షుడిగా కల్వచర్ల గ్రామానికి చెందిన ముచ్చకుర్తి శ్రీనివాస్‌ను నియమించినట్లు గురువారం మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరుకాపు సామాజిక అభివృద్ధికి పాటుపడతానన్నారు. త్వరలోనే గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి మున్నూరుకాపు సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

జూలపల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని చీమలపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వెద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎం అరుణ, కార్యదర్శి సంధ్య, ఆశాలు పాల్గొన్నారు.

మూడో డివిజన్‌లో రెవెన్యూ అధికారుల పరిశీలన


వివరాలు నమోదు చేస్తున్న గిర్దవార్ వినోద్

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్‌లో ఇటీవల వర్ష బీభత్సంతో నష్టపోయిన ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. గురువారం డివిజన్‌లోని జంగాలపల్లె, బి–గేట్ కాలనీ, మేడిపల్లి గ్రామాల్లో గిర్దవార్–1 వినోద్ పర్యటించారు. ఈదురుగాలులకు కూలిన రేకుల షెడ్లతో పాటు కూలిన గోడలు, నష్టపోయిన వివరాలను ఆయన నమోదు చేసుకున్నారు. నమోదు చేసుకున్న వివరాలను తహసీల్దార్‌కు, రామగుండం ఎమ్మెల్యేకు తెలియజేస్తామన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వపరంగా సాయం అందించేందుకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు కాంగ్రెస్ ఎన్టీపీసీ పట్టణ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా, డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి మల్లేశ్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లోని శ్రీవాణి జూనియర్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా పద్మశాలి సేవా సంఘం అడ్‌హాక్ కమిటీ, మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. 200 మంది 2డీకో, ఈసీజీ, మూత్ర, రక్త బీపీ, షుగర్ పరీక్షలు ఫిజీషియన్ డాక్టర్ వేముల సత్యనారాయణ, గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రతిష్ఠారావు నిర్వహించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా మెడికవర్ యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు వైద్యాన్ని చేరువ చేస్తోందన్నారు. జిల్లా అడ్‌హాక్ కమిటీ చైర్మన్ వల్స నీలయ్య, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడెపు సుధాకర్, బత్తుల రమేశ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బూర్ల లక్ష్మీనారాయణ, అడ్‌హాక్ కమిటీ జిల్లా సభ్యులు పెగడ చందు, డీవీఎస్ మూర్తి, పద్మశాలి సంఘం సభ్యులు సత్యనారాయణ, అంబదాస్, పర్శరాములు, లక్ష్మీపతి, రవీందర్, రాజేంద్రప్రసాద్, రాజు, మహేశ్, శ్రీధర్, మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్, శ్రీనివాస్‌గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి పనులపై కలెక్టర్‌కు వినతి


వినతిపత్రం ఇస్తున్న ఎంపీటీసీ వసంత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్–దస్తగిరిపల్లి గ్రామాల మధ్య గల అండర్ బ్రిడ్జి వద్ద వానాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడకుండా శాశ్వత పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ మిట్టపల్లి వసంత కోరారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను గురువారం కలిసి ఆమె వినతిపత్రం అందించారు. పెద్దబొంకూర్– దస్తగిరిపల్లి వద్ద గల (అండర్‌బ్రిడ్జి నెం. 26)లోకి మట్టి, వర్షపు నీరు చేరకుండా సీసీరోడ్డు నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని, వాటితో పాటు రిటర్నింగ్ వాల్ నిర్మించేలా ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు.

ఎమ్మార్పీ భవనంపై పడిన చెట్టు తొలగింపు

సుల్తానాబాద్: పట్టణంలో ఉన్న ఎమ్మార్సీ భవనంపైన పడిన చెట్టును కార్మికులు గురువారం తొలగించారు. రెండురోజుల క్రితం ఈదురుగాలుల వర్షానికి భారీ చెట్టు ఎమ్మార్సీ భవనంపై పడింది. తెల్లవారుజామున పడడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. చెట్టును తొలగించి, బిల్డింగ్‌పైన స్వల్ప మరమ్మతు చేయించాలని అధికారులు తెలిపారు.